# విధుల్లో పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. బీ గోపి
- కలెక్టరేట్ ఆడిటోరియంలో నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ

కలెక్టరేట్, అక్టోబర్ 13: రాబోయే సాధారణ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా విధులను నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. బీ గోపి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలింగ్ రోజు ఒక్కరు పొరపాటు చేసినా ఆ ఫలితానికి జిల్లా మొత్తం బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ దృష్ట్యా ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.


మాట్లాడుతున్న కలెక్టర్ డా. బీ గోపి

**ఎన్నికల విధివిధానాలు తెలుసుకోవాలి**

పోలింగ్ రోజున కేటాయించిన పోలింగ్ మెటీరియల్‌ను రూట్‌ల వారీగా నిర్దేశించిన వాహనంలో మాత్రమే తీసుకువెళ్లాలని, ఏదైనా కారణంతో వాహనం చెడిపోతే వెంటనే పైఅధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లయితే వారు మరో వాహనాన్ని సమకూరుస్తారని తెలిపారు. ఆ వాహనంలో మాత్రమే మెటీరియల్‌తో వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎలాంటి పరిస్థితుల్లో పోలింగ్ మెటీరియల్‌తో ప్రయాణిస్తున్న వాహనాన్ని ఆపడంగాని, వాహనాన్ని వదిలి వెళ్లడం వంటి చర్యలు చేపట్టరాదని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల విధివిధానాలను సూచించే పుస్తకాలను పవిత్రగ్రంథాలుగా భావించి పూర్తిగా చదవాలని సూచించారు.


ఈవీఎం మిషన్లు, వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న అధికారులు

**సాంకేతిక సమస్యలపై సమాచారం ఇవ్వాలి**

ప్రిసైడింగ్ ఆఫీస్ బుక్, ఫామ్-7ఏలను జాగ్రత్తగా నమోదు చేయాలని, పోలింగ్ సమయంలో ఈవీఎం, వీవీప్యాట్, కంట్రోల్ యూనిట్లలో సాంకేతిక సమస్యలు తలెత్తినట్లయితే వెంటనే ఆర్‌వో, సెక్టోరల్ అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. వారు వెంటనే మరో యూనిట్‌ను కేటాయిస్తారని, దానిని పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో నోటాతో కలుపుకొని అన్ని గుర్తులపై ఒక్కసారి మాత్రమే నొక్కేలా మాక్‌పోల్ నిర్వహించాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో చివర పోలింగ్ మెటీరియల్ వీవీ ప్యాట్, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్‌లపై అవగాహన కల్పించారు. అవసరమైన వారి కోసం కలెక్టరేట్‌లో శనివారం కూడా పోలింగ్ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం ఇంటిగ్రెటెడ్ కాల్ సెంటర్, కలెక్టరేట్ కార్యాలయం కలియతిరిగి ఎన్నికల నియమావళి కొనసాగుతున్న దృష్ట్యా పోస్టర్లు, బ్యానర్లు ఏవైనా ఉన్నాయా అని పరిశీలించారు. కార్యక్రమంలో కరీంనగర్ ఆర్డీవో కే మహేశ్వర్, మార్కెటింగ్ అధికారి పద్మావతి, జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, సీపీవో కొమురయ్య, జిల్లా కోశాగార ఉపసంచాలకులు నాగరాజు, కలెక్టరేట్ ఏవో సుధాకర్, తహసీల్దార్లు తిరుమల్ రావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క అవకాశం ఇవ్వండి

- నియోజకవర్గానికి రూ.వెయ్యి కోట్లు తెస్తా
- అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా..
- ముఖం చాటేసే నాయకుడు మనకు అవసరమా..?
- హుజూరాబాద్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి
- జమ్మికుంట మండలంలోని పలు గ్రామాల్లో పర్యటన

జమ్మికుంట, అక్టోబర్ 13: 'పనిచేయని, పట్టించుకోని ఓ నాయకుడికి ఏడు సార్లు అవకాశం ఇచ్చారు. నాకు ఒకే ఒక్క అవకాశం ఇచ్చి చూడండి. నియోజకవర్గానికి రూ.వెయ్యి కోట్లు తెస్తా. అభివృద్ధి అంటే ఎంటో చూపిస్తా.. సంవత్సర కాలంగా గెలిచి, ముఖం చాటేసే నాయకుడు మనకు అవసరమా..? చెప్పండి. పనిచేసేదెవరో గుర్తించండి. మీ బిడ్డగా ఆదరించండి. అసెంబ్లీకి పంపండి. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా.' అని మండలి విప్, బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మండలంలోని జగ్గయ్యపల్లి, పెద్దంపల్లి, మాచినపల్లి, మడిపల్లి, అంకుశాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలను కలిశారు. సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంవత్సరన్నర కాలంగా మీ మధ్యలో తిరుగుతున్నానని, ప్రజలే తన కుటుంబ సభ్యులుగా భావిస్తున్నానని పేర్కొన్నారు. వారి సమస్యలు ఎక్కడికక్కడే పరిష్కరిస్తున్నానని తెలిపారు. గ్రామాల్లోని అర్హులైన ప్రతి దరఖాస్తుదారుకు గృహలక్ష్మి మంజూరు చేయించానని చెప్పారు. గతంలో జరిగిన తప్పిదాలను మళ్లీ చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని, కేసీఆర్‌కు బహుమతిగా అందిద్దామన్నారు. అంతకుముందు గ్రామాల్లో మండలి విప్ పర్యటన సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. జై తెలంగాణ.. జై కేసీఆర్.. జై కౌశికన్న అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ దొడ్డె మమత-ప్రసాద్, జడ్పీటీసీ డాక్టర్ శ్రీరాం శ్యాం, జగ్గయ్యపల్లి, పెద్దంపల్లి, మాచినపల్లి, మడిపల్లి, అంకుశాపూర్ సర్పంచులు వంశీధర్‌రావు, కల్పన, అన్నపూర్ణ, పరశురాములు, రాజిరెడ్డి, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, ఆర్బీఎస్ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# 13 స్థానాల్లో బీఆర్ఎస్‌దే గెలుపు

- బీజేపీ, కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలో చెప్పాలి
- ఇందిరమ్మ రాజ్యం అంటే కుట్రలు, కుతంత్రాలు, మతకల్లోలాలు సృష్టించడమేనా?
- రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్

కార్పొరేషన్, అక్టోబర్ 13: వచ్చే ఎన్నికల్లో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని 13 శాసనసభ స్థానాల్లో బీఆర్ఎస్ విజయకేతనం ఎగురవేయడం ఖాయమని రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు వచ్చాయి కదా అని విమర్శలు చేస్తున్న బీజేపీ నాయకుడు బండి సంజయ్ అసలు ఆపార్టీకి ఎందుకు ఓటు వేయాల్లో ప్రజలకు చెప్పాలన్నారు. ఇన్నాళ్లూ మొద్దు నిద్రలో ఉన్న ఆయన, ఇప్పుడు యువతను రెచ్చగొట్టి తన పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. ఎంపీగా గెలిచిన ఏం సాధించారో ప్రజలకు చెప్పి ఓట్లు అడగాలని సవాల్ చేశారు. జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి బండి సంజయ్ చేసిందేమీ లేదని విమర్శించారు. డిసెంబర్ 9న ఇందిరమ్మ రాజ్యం వస్తుందన్న రేవంత్ రెడ్డి, ప్రజలు దానిని కోరుకోవడం లేదన్న విషయం తెలుసుకోవాలన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే కుట్రలు, కుతంత్రాలు, ఎమర్జెన్సీ, మతకల్లోలాలు సృష్టించడమేనా అని ప్రశ్నించారు. దేశంలో అందరూ రామరాజ్యమే కోరుకుంటారని, అది సీఎం కేసీఆర్ హయాంలో సాగుతున్నదన్నారు. రాష్ట్రంలో పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు అందరినీ అన్ని విధాలుగా సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్నారని తెలిపారు. ఎన్నికలు వచ్చాయని ఇష్టం వచ్చినట్లుగా పథకాల హామీలు గుప్పిస్తున్న కాంగ్రెస్, బీజేపీలు ఇప్పుడు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో వాటిని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మరోసారి బీఆర్ఎస్ గెలువడం ఖాయమని, సీఎంగా కేసీఆర్ కొనసాగుతారని తాము ప్రజలకు చెబుతున్నామని, దమ్ముంటే కాంగ్రెస్, బీజేపీలు తమ సీఎం అభ్యర్థి ఎవరో ప్రజలకు చెప్పి ప్రచారం చేయాలన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని 13 స్థానాల్లో అత్యధిక మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఖాయమని, ఎవరు ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా మూడోవసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. ఉద్యమ ఖిల్లా కరీంనగర్ బీఆర్ఎస్‌కు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పెండ్యాల మహేశ్, గుంజపడుగు హరిప్రసాద్, కెమసారం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


రాంనగర్‌లోని మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న మంత్రి గంగుల

# కేటీఆర్ సభను విజయవంతం చేయాలి

- రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్
- నగరంలోని మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌లో సభ ఏర్పాట్ల పరిశీలన

కార్పొరేషన్, అక్టోబర్ 13: ఈ నెల 18న నగరంలో నిర్వహించే మంత్రి కేటీఆర్ ఆశీర్వాద సభను విజయవంతం కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మేయర్, నాయకులతో కలిసి సభాస్థలం రాంనగర్‌లోని మార్క్‌ఫెడ్ గ్రౌండ్‌ను పరిశీలించారు. సభ నిర్వహణకు అవసరమయ్యే వేదిక, పార్కింగ్, ప్రజలు వచ్చేందుకు వీలుగా సౌకర్యాలు, తదితర ఏర్పాట్లపై పార్టీ నాయకులతో సమీక్షించారు. ఎవరికీ ఇబ్బంది రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్ బొనాల శ్రీకాంత్, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరికలు

- రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


మానకొండూర్‌లో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రసమయి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

శంకరపట్నం, అక్టోబర్ 13: తెలంగాణలో సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. శుక్రవారం శంకరపట్నం మండలం గద్దపాక గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు మానకొండూర్‌లో సుడా చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు నివాసంలో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మానకొండూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. అర్హులందరికీ పథకాలు వర్తింపజేశామన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పులి కోట రమేశ్, సింగిల్ విండో చైర్మన్ గుర్రాల తిరుపతిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పరశురాములు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఉమ్మెంతల సతీశ్‌రెడ్డి, మలహలరావు తదితరులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం

- పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు


బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డితో మాట్లాడుతున్న కెప్టెన్

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 13: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి ఘన విజయం సాధిస్తారని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వీ లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి శుక్రవారం హుజూరాబాద్ మండలం సింగాపురంలో కెప్టెన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కెప్టెన్ మాట్లాడుతూ, హుజూరాబాద్ మండలంలోని బీఆర్ఎస్ కార్యకర్తలందరూ పార్టీ వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తారని పేర్కొన్నారు. వ్యక్తులు ముఖ్యం కాదని, పార్టీ గెలుపే ప్రధానమన్నారు.